సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 23 । అక్టోబర్ । 2024



'అపార్'మైన ప్రయోజనాలు!
విద్యార్థులకు 12 అంకెలతో కూడిన 'అపార్' కార్డును అందించేందుకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 8లో



ఖోఖో జిల్లా జట్ల ఎంపిక
గుంటూరు జిల్లా కారంచేడులో 6 నుంచి 8వ తేదీ వరకు జరిగే ఖోఖో పోటీల్లో తలపడనున్న జిల్లా జట్లను ఎంపిక చేశారు. 8లో



మద్యాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం
రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేసిందని ఐద్వా జిల్లా నాయకులు సత్యవతి మండిపడ్డారు. 8లో

న్యూస్‌రీల్

స్టీల్‌ప్లాంట్‌లో కార్మిక సమ్మె రద్దు


అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న కార్మిక నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాలు ఈనెల 28న తలపెట్టిన కార్మిక సమ్మె రద్దయింది. మంగళవారం జరిగిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ప్రస్తుతం ప్లాంట్ పరిస్థితి దృష్ట్యా యాజమాన్యం అభ్యర్థన మేరకు సమ్మె చేయకూడదని కార్మిక నాయకులు అభిప్రాయపడ్డారు. 28న సమ్మె బదులుగా ఆ రోజు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 24న గోడ పత్రిక విడుదల చేయాలని, 26న కరపత్రాలు పంపిణీ చేయాలని తీర్మానించారు. సమావేశంలో యాజమాన్యం ప్రతిపాదిస్తున్న వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ (వీఆర్‌ఎస్)ను రద్దు చేయాలని, కొత్త నియామకాలు చేపట్టాలని తీర్మానించారు. డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, జె.రామకృష్ణ, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, వై.టి.దాస్, డి.అప్పారావు, రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాసరావు, ఎల్.వి. రమణారావు, ఎం.మహాలక్ష్మి నాయుడు, కారు రమణ, కొవిరి అవతారం పాల్గొన్నారు.

ఆస్తి పన్ను, పారిశుధ్య నిర్వహణపై అధ్యయనం

కొనసాగుతున్న కార్పొరేటర్ల టూర్



బెంగళూరు కార్పొరేషన్ స్పెషల్ కమిషనర్‌ను సత్కరిస్తున్న జీవీఎంసీ కార్పొరేటర్లు

అల్లిపురం: జీవీఎంసీ కార్పొరేటర్ల అధ్యయన యాత్ర కొనసాగుతోంది. జీవీఎంసీ కార్యదర్శి బి.వి.రమణ ఆధ్వర్యంలో మంగళవారం వారు బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్‌ను సందర్శించారు. అక్కడ నిర్వహిస్తున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఆస్తి పన్ను, పారిశుధ్య నిర్వహణ, స్మార్ట్ వాటర్ మోనటరింగ్‌లో తీసుకుంటున్న జాగ్రత్తలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ముందస్తు కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాల గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. స్పెషల్ కమిషనర్ సురాల్కర్ వికాస్ కిశోర్‌ను డిప్యూటీ మేయర్, ఫ్లోర్‌లీడర్లు, కార్పొరేటర్లు సత్కరించారు. అనంతరం బీబీఎంపీ ప్రైమరీ కలెక్షన్ పాయింట్‌ను పరిశీలించారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా విభజించడం, ప్లాస్టిక్ వేరు చేయడం తదితర అంశాలపై అధ్యయనం చేసినట్లు కార్యదర్శి తెలిపారు.

డిసెంబర్ 14న లోక్‌అదాలత్

మహారాణిపేట : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో నిర్వహిస్తున్నారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్టపరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్, బ్యాంక్, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు(విడాకులు కేసులు కాకుండా) పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ తెలిపింది.

28 నుంచి ఐటీఐ ఐదో విడత కౌన్సెలింగ్

కంచరపాలెం: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో వివిధ ట్రేడ్‌ల్లో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 28 నుంచి 5వ విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. 26లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు, 27న సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు. కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో ఈ నెల 28 నుంచి 30 వరకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

ఉచిత శిక్షణ, ఉపాధి

విశాఖ సిటీ: టెక్ మహీంద్రా ఫౌండేషన్ సహకారంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థ డైరెక్టర్ మయూర్ పట్నాల ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై 18 నుంచి 28 ఏళ్లలోపు గల వారు అర్హులని పేర్కొన్నారు. టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్‌నెట్ కాన్సెప్ట్స్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్ కోర్సుల్లో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని వివరించారు. శిక్షణ అనంతరం ఉపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు బాజీ జంక్షన్‌లో గల నిర్మాణ్ ఆర్గనైజేషన్ కేంద్రంలో గాని, 9908104113, 6304159549 నెంబర్లలో గాని ఈ నెల 26లోగా సంప్రదించాలన్నారు.

మద్యం ఏరులు



- బార్లా తెరుచుకున్న బెల్టు షాపులు
- మోత మోగిస్తున్న మద్యం ధరలు
- గత ప్రభుత్వంలో కంటే అధిక రేట్లు
- నేటి నుంచి అందుబాటులోకి రూ.99 లిక్కర్!
- అది కూడా వైన్‌షాప్‌నకు 8 కేసులే సరఫరా
- మందుబాబుల జేబులకు చిల్లు

విశాఖ సిటీ : కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీతో జిల్లాలో మద్యం ఏరులైపారుతోంది. గత అయిదేళ్లుగా మూతపడిన బెల్టు షాపులు మళ్లీ బార్లా తెరుచుకున్నాయి. మద్యం దుకాణాలు పూర్తిగా ఏర్పాటు కాకుండా వాటి అనుబంధ విక్రయ కేంద్రాలు మాత్రం ప్రతి చోటా వెలుస్తున్నాయి. మరోవైపు లిక్కర్ ధరలు మందుబాబులకు షాక్ కొడుతున్నాయి. జిల్లాలో 155 మద్యం దుకాణాలకు లాటరీ నిర్వహించి వైన్‌షాపులు కేటాయించారు. అయితే ఇప్పటికీ పూర్తి స్థాయిలో దుకాణాలు ఏర్పాటు కాలేదు. 30 మంది వరకు ఇంకా షాపుల వెతుకులాటలోనే ఉన్నారు. కొత్తగా ఏర్పాటైన వైన్‌షాపుల్లోను పాత మద్యం బాటిళ్లే దర్శనమిస్తున్నాయి. వాటి ధరలు కూడా గతంలో కంటే రూ.20 నుంచి 60 అధికంగా విక్రయిస్తుండడం గమనార్హం.

మద్యం ధరల మోత

ఏరు దాటాక తెప్ప తగలేసినట్లు అన్న సామెత కూటమి ప్రభుత్వానికి సరిగ్గా సరిపోతుంది. ఎన్నికల ప్రచారంలో అన్ని మద్యం బ్రాండ్లు అందుబాటులోకి తీసుకువస్తామని, రూ.99కే క్వార్టర్ లిక్కర్ ఇస్తామని హామీలు గుప్పించారు. ప్రధానంగా తక్కువ ధరకే నాణ్యమైన మద్యం ఇస్తామని చెప్పి.. మందుబాబుల ఓట్లు కొల్లగొట్టిన కూటమి నేతలు.. ఇప్పుడు వారి జేబులకు చిల్లులు పెడుతున్నారు. **జిల్లాలో 155 మద్యం** దుకాణాలు ఉన్నాయి. **వీటిలో గతంలో కంటే** అధిక ధరలకు మద్యాన్ని **విక్రయిస్తున్నారు.** గతంలో రాయల్ ఛాలెంజ్ **క్వార్టర్ రూ.140 ఉంటే..** ప్రస్తుతం రూ.230కి పెంచారు. అలాగే ఎంసీ విస్కీ రూ.145 ఉండగా.. రూ.180కి, అదే విధంగా ఐబీ రూ.130 నుంచి రూ.180 చేసేశారు. గత ప్రభుత్వం చీప్ లిక్కర్ రూ.120కి విక్రయించగా.. ప్రస్తుతం మంజీరా పేరుతో రూ.130కి అమ్ముతున్నారు. ఇలా ప్రతి బ్రాండ్‌పై గతంలో కంటే రేట్లు పెంచేసి ధరల మోత మోగిస్తున్నారు.

బార్లా బెల్టుషాపులు



2014–19 మధ్య జిల్లాలో మద్యం విక్రయాలు ఇష్టానుసారంగా జరిగేవి. ఒక్కో వైన్‌షాప్ ఆధీనంలో 4 నుంచి 8 వరకు బెల్టుషాపులు నిర్వహించేవారు. ఒక్కొక్కరు ఎన్ని మద్యం బాటిళ్లయినా కొనుగోలు చేసే అవకాశం ఉండడంతో రహదారుల్లో మందుబాబుల వీరంగాలు దర్శనమిచ్చేవి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించింది. బెల్టు షాపులను పూర్తిగా నియంత్రించింది. మద్యం కొనుగోలు విషయంలో కూడా 3 బాటిళ్లకు పరిమితి విధించింది. దీంతో గత అయిదేళ్లు బెల్టు షాపుల జాడే కనిపించకుండా పోయింది. కానీ తాజాగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మళ్లీ బెల్టుషాపులు తెరుచుకున్నాయి. ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటైన తొలి రోజు నుంచే బెల్టుషాపుల ఏర్పాటు ప్రారంభమైంది. వైన్‌షాప్ నిర్వాహకులే నేరుగా వారి అనుచరులు, బంధువులతో ఇళ్లు, పాన్‌షాపులు, టిఫిన్ సెంటర్లలో సైతం మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. దీంతో గుడి, బడి అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోను మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కొంత మంది తెలిసిన వారికి ముందస్తు చెల్లింపులు లేకుండానే మద్యం బాటిళ్లు సరఫరా చేసి.. విక్రయాలు జరిగిన తరువాత డబ్బులు తీసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. నగరంలోనే కాకుండా ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాల్లో గల గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపుల నిర్వహణకు కొందరు వ్యాపారులు వేలం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందులో అత్యధిక ధర ఇచ్చే వారికే బెల్టు షాపుల నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు.

నేటి నుంచి రూ.99 మద్యం..!



ఎట్టకేలకు రూ.99 మద్యం అందుబాటులోకి వస్తోంది. ఇప్పటికే ఈ చీప్ లిక్కర్ డిపోలకు చేరింది. అయితే సరిపడ స్టాక్ రాకపోవడంతో ఒక్కో వైన్‌షాప్‌కు కేవలం 8 కేసులు మాత్రమే సరఫరా చేయాలని ఎక్సైజ్ అధికారులు నిర్ణయించారు. పూర్తి స్థాయిలో స్టాక్ వచ్చిన తరువాత డిమాండ్ ఆధారంగా రూ.99 చీప్ లిక్కర్ క్వార్టర్లను సరఫరా చేయాలని అధికారులు భావిస్తున్నారు. అయితే 8 కేసులు ఒక్క రోజులోనే అయిపోతాయని వైన్‌షాప్ నిర్వాహకులు చెబుతున్నారు. కనీసం మంజీర బ్రాండ్ మద్యం సరఫరా ఉన్నా.. కొంత మేర సర్దుబాటు అవుతుందని పేర్కొంటున్నారు. ఆ బ్రాండ్ సరఫరా కూడా తక్కువగానే ఉండడంతో మందుబాబులకు తక్కువ ధరకు మద్యం దొరికే పరిస్థితి ప్రస్తుతానికి కనిపించడం లేదు.

జిల్లాకు రెండు కేంద్ర జల శక్తి అవార్డులు

స్వీకరించిన కలెక్టర్, తిరుమలనగర్ అసోసియేషన్ ప్రతినిధులు


కేంద్ర మంత్రి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న తిరుమలనగర్ అసోసియేషన్ ప్రతినిధులు

మహారాణిపేట/అగనంపూడి: జల వనరుల నిర్వహణ, సంరక్షణలో 2023 ఏడాదికి గానూ ఉత్తమ జిల్లా కేటగిరీలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ అవార్డు స్వీకరించారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ వివిధ విభాగాలకు 5వ జాతీయ నీటి అవార్డులు–2023 ప్రకటించగా.. ఉత్తమ జిల్లా విభాగంలో సౌత్‌జోన్ విజేతగా రాష్ట్రం నుంచి విశాఖ జిల్లా నిలిచింది. న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కలెక్టర్ ఈ అవార్డును స్వీకరించారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, సహాయ మంత్రులు వి.సోమన్న, రాజ్‌భూషణ్ చౌదరి, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు కలెక్టర్‌ను అభినందించారు.

- ఇంకుడు గుంతలతో నీటి సంరక్షణ, నీటి పొదుపును పాటించడంలో జాతీయ స్థాయి ఖ్యాతిని సాధించిన తిరుమలనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కేంద్ర జలశక్తి అవార్డును అందుకున్నారు. కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేతులమీదుగా తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి విశ్వేశ్వరరావు, కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి పరమానందం ఈ అవార్డును స్వీకరించారు. రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విభాగంలో ఈ అవార్డును అందుకున్నట్లు విశ్వేశ్వరరావు తెలిపారు.

బడుల్లో ఉపాధి పాఠాలు

- జిల్లాలో ఎంపిక చేసిన 19 స్కూళ్లలో నైపుణ్య శిక్షణ
- 9, 10, ప్లస్ టూ విద్యార్థులకు తర్ఫీదు
- ఎన్‌ఈపీ అమల్లో భాగంగా సరికొత్త కోర్సులు
- పీఎం శ్రీ పాఠశాలల్లో ప్రయోగశాలల నిర్మాణం

విశాఖ విద్య: జాతీయ విద్యా విధానం అమలుతో సరికొత్త చదువులు అందుబాటులోకి వస్తున్నాయి. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ప్రాయోజిత కార్యక్రమాలతో పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందుతోంది. జిల్లాలో ఎంపిక చేసిన 19 పాఠశాలల్లో వృత్తి విద్యా బోధన సాగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా కల్పించేందుకు 2023–24 విద్యా సంవత్సరంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే బలమైన పునాదులు పడ్డాయి.

అమలవుతున్న కోర్సులివే..

అగ్రికల్చర్, ఆటోమోటివ్, ఐటీ–ఐటీఈఎస్, ఎలక్ట్రానిక్స్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, రిటైల్, అపెరల్, బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర వృత్తి విద్యా కోర్సులు అమలవుతున్నాయి. వీటిలో నచ్చిన వాటిని ఎంపిక చేసుకునే అవకాశం విద్యార్థులకే కల్పిస్తున్నారు. పాఠశాల, ప్లస్ టూ స్కూళ్లలో ప్రతి రోజూ ఒక పీరియడ్‌ను వృత్తి విద్యా కోర్సులు బోధించేలా.. వారంలో తప్పనిసరిగా మూడు పీరియడ్లు బోధన సాగేలా షెడ్యూల్ వేశారు. మరో మూడు పీరియడ్లు ప్రాక్టికల్స్ నిర్వహిస్తూ విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రావీణ్యత పొందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.


కంప్యూటర్ మెకానిజం నేర్చుకుంటున్న విద్యార్థిని

పీఎం శ్రీ స్కూళ్లలో ప్రయోగశాలలు

పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు దూసుకెళ్లేలా కేంద్ర ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుంటుంది. ఇందులో భాగంగా తొలి విడతలో జిల్లాలో ఐదు స్కూళ్లను ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎం శ్రీ) పథకం కింద ఎంపిక చేశారు. వీటిలో రైల్వే న్యూ కాలనీ, పద్మనాభం మండలం రేవడి పాఠశాలల్లో ప్రత్యేకంగా రూ.15.58 లక్షలు చొప్పున వెచ్చించి కెమిస్ట్రీ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

మూడు చోట్ల నైపుణ్య హబ్‌లు

పాఠశాల స్థాయిలో నైపుణ్యతతో కూడిన చదువులకు ప్రాధాన్యమిచ్చే క్రమంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో మూడు చోట్ల నైపుణ్య హబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు సమగ్ర శిక్ష అధికారులు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని చింతల అగ్రహారం ఉన్నత పాఠశాల, ఆనందపురం ఉన్నత పాఠశాల, ఆనందపురంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాలను ఇందుకోసం ఎంపిక చేశారు. ఎలక్ట్రానిక్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో ఇక్కడ విద్యార్థులకు తర్ఫీదునిచ్చేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



క్షేత్ర సందర్శనతో కొత్త ఆలోచనలు

పాఠశాల పని దినాల్లో రెగ్యులర్ తరగతులు నిర్వహిస్తూ.. సెలవు రోజుల్లో వృత్తి విద్యా కోర్సులు అభ్యసించే విద్యార్థులను క్షేత్ర సందర్శనకు తీసుకెళ్తున్నారు. పాఠశాలకు సమీపంలోని కుటీర, మధ్య తరగతి పరిశ్రమలు, చేతి వృత్తుల కేంద్రాలు, బ్యూటీషియన్ సెంటర్లలో శిక్షణ ఇస్తున్నారు. తరగతి గదుల్లో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సరిపోల్చుతూ.. మరింత అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులు తమ ఆలోచనలు పంచుకుని.. సరికొత్త ప్రయోగాలు చేసేందుకు ఈ విధానం దోహదపడుతుందని ఉపాధ్యాయులు అంటున్నారు.

ఉపాధి పొందేలా తర్ఫీదు

టెన్త్, ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు స్వశక్తిపై నిలబడేలా జిల్లాలో ఎంపిక చేసిన 19 పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ప్రతీ పాఠశాలలో ఇద్దరు చొప్పున బోధకులను నియమించారు. వీరు 9, 10వ తరగతి, ప్లస్ టూ స్కూళ్లలో ఆసక్తి ఉన్న విద్యార్థులను ఒక్కో ట్రేడ్‌కు 50 మంది చొప్పున ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్ పూర్తయ్యే సరికి ప్రతీ విద్యార్థి తమకునచ్చిన రెండు కోర్సుల్లో నైపుణ్యత సాధించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ మొత్తం ప్రక్రియను జిల్లా సమగ్ర శిక్ష అధికారులు పర్యవేక్షిస్తున్నారు.


విద్యార్థులకు మెలకువలు నేర్పిస్తున్న ఇన్‌స్ట్రక్టర్

విద్యార్థులకు ఎంతో మేలు

వృత్తి విద్యా కోర్సులతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతోంది. ఉన్నతాధికారుల సూచనలకు అనుగుణంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో వృత్తి విద్యను పకడ్బందీగా అమలు చేస్తున్నాం. విద్యార్థులను క్షేత్రస్థాయి సందర్శనకు తీసుకెళ్లేందుకు ప్రాధాన్యమిస్తున్నాం. స్కూళ్లను తరచూ సందర్శించి విద్యార్థుల ప్రగతిపై సమీక్షిస్తున్నాం.
– ఖలీషా బేగం, జీసీడీవో, సమగ్ర శిక్ష, విశాఖ జిల్లా

తుపాను ఎఫెక్ట్.. పలు రైళ్ల రద్దు



తాటిచెట్లపాలెం : దానా తుపాను కారణంగా వాల్తేర్ డివిజన్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

23న రద్దయిన రైళ్లు

కన్యాకుమారి–డిబ్రూగఢ్(22503) ఎక్స్‌ప్రెస్, సిల్చార్–సికింద్రాబాద్(12514) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–భువనేశ్వర్(17016) విశాఖ ఎక్స్‌ప్రెస్, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–హౌరా(12840) మెయిల్ ఎక్స్‌ప్రెస్, పుదుచ్చేరి–హౌరా(12868) ఎక్స్‌ప్రెస్, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్– షాలిమర్(22826) షాలిమర్ ఎక్స్‌ప్రెస్, పుదుచ్చేరి–భువనేశ్వర్(12897)ఎక్స్‌ప్రెస్, కేఎస్ఆర్ బెంగళూరు–భువనేశ్వర్ (18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి–భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు– గౌహతి (12509) ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–హౌరా(18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–హౌరా(12704)ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీటీ బెంగళూరు–హౌరా (22888)హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీటీ బెంగళూరు–హౌరా (12864) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సూరత్–బ్రహ్మపూర్(09059) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, కామాఖ్య– ఎస్ఎంవీ బెంగళూరు(12552) ఏసీ ఎక్స్‌ప్రెస్, డిబ్రూగఢ్–కన్యాకుమారి(22504) వివేక్ ఎక్స్‌ప్రెస్, గాంధీదాం–పూరీ(22973) ఎక్స్‌ప్రెస్

24న రద్దయిన రైళ్లు

సికింద్రాబాద్–మాల్డా టౌన్ (03429) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, తిరునల్వేలి–షాలిమర్(06087) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, హౌరా–సికింద్రాబాద్(12703)ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, ఖరగ్‌పూర్–విల్లుపురం (22603) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, షాలిమర్–హైదరాబాద్(18045)ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి–మంగుళూరు(22851) వివేక్ ఎక్స్‌ప్రెస్, షాలిమర్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12841) కోరమండల్ ఎక్స్‌ప్రెస్, హౌరా–తిరుచ్చిరాపల్లి(12663) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హౌరా–ఎస్ఎంవీటి బెంగళూరు (12863) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, షాలిమర్–వాస్కోడగామా (18047) అమరావతి ఎక్స్‌ప్రెస్, హౌరా – ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12839) మెయిల్ ఎక్స్‌ప్రెస్, పాట్నా–ఎర్నాకుళం (22644) ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి–ఎంజీఆర్‌చెన్నై సెంట్రల్ (06090) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, రూర్కెలా– గుణుపూర్(18117) రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్, కటక్–గుణుపూర్(08421) మెము ఎక్స్‌ప్రెస్, గుణుపూర్–విశాఖపట్నం(08521) పాసింజర్ స్పెషల్, పలాస–విశాఖపట్నం(07471) మెము స్పెషల్, భువనేశ్వర్–జునాగఢ్(20837) ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–జగదల్‌పూర్(18447) హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్, పూరీ–గుణుపూర్(18417) ఎక్స్‌ప్రెస్, విశాఖ–భువనేశ్వర్(20842) వందేభారత్ ఎక్స్‌ప్రెస్, విశాఖ–డిఘా(22874) ఎక్స్‌ప్రెస్, గుణుపూర్–రూర్కెలా (18118) రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్, విశాఖ–భువనేశ్వర్(22820) ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్, విశాఖ–బ్రహ్మపూర్ (08532) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, ఎంజీర్ చెన్నై సెంట్రల్–షాలిమర్ (12842) కోరమండల్ ఎక్స్‌ప్రెస్, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–సాంత్రగచ్చి (22808) ఏసీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీటి బెంగళూరు–ముజఫర్‌పూర్(15227) ఎక్స్‌ప్రెస్, జునాగఢ్‌రోడ్–భువనేశ్వర్ (20838) ఎక్స్‌ప్రెస్, జగదల్‌పూర్–భువనేశ్వర్ (18448) హిరాకండ్ ఎక్స్‌ప్రెస్, తంబరం–సంత్రగచ్చి(06095) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు– హౌరా(12246) దురంతో ఎక్స్‌ప్రెస్, గుణుపూర్–పూరీ(18418) ఎక్స్‌ప్రెస్, పూరీ–తిరుపతి(17479) ఎక్స్‌ప్రెస్, విశాఖ–గుణుపూర్(08522) పాసింజర్ స్పెషల్, విశాఖ–పలాస(07470) మెము, విశాఖ–బ్రహ్మపూర్(18526) ఎక్స్‌ప్రెస్.

25న రద్దయిన రైళ్లు

బ్రహ్మపూర్–సూరత్(09060) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, డిఘా–విశాఖపట్నం(22873) ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–విశాఖపట్నం(22819) ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్, బ్రహ్మపూర్–విశాఖపట్నం(08531) పాసింజర్ స్పెషల్, గుణుపూర్–విశాఖపట్నం(08521) పాసింజర్ స్పెషల్, బ్రహ్మపూర్–విశాఖపట్నం(18525) ఎక్స్‌ప్రెస్, గుణుపూర్–కటక్(08422) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–అమృత్‌సర్(20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్, గుణుపూర్–పూరీ(18418) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–గుణుపూర్(08522) పాసింజర్ స్పెషల్, పూరీ–గుణుపూర్(18417) ఎక్స్‌ప్రెస్.

25న జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్, సద్గురు గ్రూప్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో 150 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. రిలేషన్‌షిప్ ఆఫీసర్, బిజినెస్ ప్రమోటర్స్, మార్కెటింగ్ మేనేజర్, టీమ్ లీడర్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై 18–35 ఏళ్ల వయసు గల అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు. ఆయా ఉద్యోగాలను బట్టి జీతం నెలకు రూ.16 వేలు నుంచి రూ.25 వేల వరకు ఉంటుంది.

స్కూళ్ల నిర్వహణకు సగం నిధులే!

- ఎట్టకేలకు విడుదల చేసిన ప్రభుత్వం

విశాఖ విద్య: ఎట్టకేలకు పాఠశాల నిర్వహణ నిధులను కూటమి ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయాలకు చేరాయి. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా స్కూళ్ల నిర్వహణకు నిధులు విడుదలయ్యాయి. అయితే 2024–25 విద్యా సంవత్సరానికి లెక్క గట్టిన నిధుల్లో ప్రస్తుతం 50 శాతం మాత్రమే విడుదల చేశారు. మిగతా 50 శాతం ఎప్పట్లోగా మంజూరు చేస్తారనేది స్పష్టం చేయలేదు.

విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు దాటినా పాఠశాలల నిర్వహణ నిధులు మంజూరు చేయకపోవడంపై ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో పాఠశాలల నిర్వహణ భారమంతా ప్రధానోపాధ్యాయులపైనే పడింది. కొన్ని చోట్ల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులంతా తమ వేతనాల్లోంచి కొంత మొత్తం పోగు చేసి.. ప్రాధాన్యత మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్కూల్ గ్రాంట్, ఎమ్మార్సీ గ్రాంట్ల మంజూరు కోసమని ఉపాధ్యాయ సంఘాలన్నీ రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులకు పలుమార్లు వినతిపత్రాలను సైతం అందజేశాయి. ఎట్టకేలకు స్పందించిన కూటమి ప్రభుత్వం వార్షిక నిర్వహణ నిధుల మొత్తంలో 50 శాతం మంజూరు చేసింది. విశాఖపట్నం జిల్లాలో 559 పాఠశాలలకు రూ.91.95 లక్షలు, అనకాపల్లి జిల్లాలో 1,392 పాఠశాలలకు రూ.172.075 లక్షలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,662 స్కూళ్లకు 152.05 లక్షలను ప్రభుత్వం విడుదల చేసింది.

ఒక్కో ఎమ్మార్సీకి రూ.1.30 లక్షలు

ఉమ్మడి జిల్లాలోని మండల వనరుల కేంద్రాలకు కూడా నిధులు మంజూరయ్యాయి. మండల కేంద్రాల్లో ఎంఈవోలు వీటిలోనే కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. వీటి నిర్వహణకు ఒక్కో దానికి రూ.1.30 లక్షలు చొప్పున మంజూరయ్యాయి. వీటిలో ఎమ్మార్సీ నిర్వహణకు రూ.30 వేలు, టీఎల్ఎం కోసం రూ.30 వేలు, సమావేశాల రవాణా భత్యం కింద రూ.30 వేలు, కాంటిజెంట్ గ్రాంట్‌గా రూ.40 వేలు ఖర్చు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విశాఖ జిల్లాలో 11 ఎమ్మార్సీలకు రూ.14.30 లక్షలు, అనకాపల్లి జిల్లాల్లో 24 ఎమ్మార్సీలకు రూ.31.20 లక్షలు, అల్లూరి జిల్లాలో 22 ఎమ్మార్సీలకు రూ.28.6 లక్షలు విడుదలయ్యాయి.

క్లుప్తంగా

నేడు నర్సుల అసోసియేషన్ ఎన్నికలు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ జిల్లా యూనిట్‌కు బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేజీహెచ్ యూనియన్ బ్యాంకు శాఖ పక్కనున్న భవనంలోని నర్సస్ క్లాక్ రూమ్‌లో సీక్రెట్ బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరుగుతాయి. మొత్తం 555 మంది నర్సులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. భవాని, ఉషా రాణి ప్యానళ్లు పోటీ పడుతున్నాయి. ఎన్నికల నిర్వహణకు రెండు పోలింగ్ స్టేషన్లు, 12 మంది సిబ్బందిని నియమించారు. ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకు రావాలని ఎన్నికల అధికారి సూచించారు.

అవగాహనతోనే రొమ్ము క్యాన్సర్ నివారణ

విమ్స్ డైరెక్టర్ రాంబాబు



మహిళలకు పరీక్షలు చేస్తున్న విమ్స్ వైద్యులు

ఆరిలోవ: మహిళలు 45 ఏళ్లు దాటితే తప్పనిసరిగా రొమ్ము క్యాన్సర్ రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు సూచించారు. విమ్స్‌లో మంగళవారం రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు జరిగింది. ఈ శిబిరంలో ఆంకాలజీ వైద్యులు డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ భవాని మహిళలకు పరీక్షలు చేశారు. అనంతరం రొమ్ము క్యాన్సర్, దాని లక్షణాలు, అనర్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ముందుగా శిబిరాన్ని ప్రారంభించిన డైరెక్టర్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ మహిళలు ఎక్కువగా రొమ్ము క్యాన్సర్‌కు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, అందుకే ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. జీవన శైలిలో వస్తున్న వేగవంతమైన మార్పులు కారణంగా రొమ్ము క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయన్నారు. పిల్లలు లేని మహిళలు, పొగాకు, మద్యం సేవించే మహిళలు, 12 ఏళ్ల కంటే ముందే రజస్వల అయిన వారిలో రొమ్ము క్యాన్సర్ రావడానికి ఎక్కువగా అవకాశం ఉందన్నారు. విమ్స్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అపార్‌మైన ప్రయోజనాలు!

- విద్యార్థులకు సరికొత్త గుర్తింపు కార్డులు
- డిజిటల్ కార్డుల్లో సమగ్ర సమాచారం
- జిల్లాలో 1.30 లక్షల మంది వివరాల సేకరణ
- తొలి విడతలో 9 నుంచి ఇంటర్ విద్యార్థులకు పంపిణీ



గోపాలపట్నం హైస్కూల్ ప్లస్ టూలో చదువుతున్న విద్యార్థినులు

విశాఖ విద్య: విద్యార్థులకు సరికొత్త గుర్తింపు కార్డులు సిద్ధమవుతున్నాయి. జాతీయ విద్యావిధానం అమల్లో భాగంగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ 'వన్ నేషన్- వన్ స్టూడెంట్'అనే నినాదంతో విద్యార్థులకు 12 అంకెలతో కూడిన 'అపార్'(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డును అందించేందుకు చకాచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. తొలుత జిల్లాలో చదువుతున్న 9 నుంచి ఇంటర్మీడియెట్ వరకు గల సుమారు 1.30 లక్షల మంది విద్యార్థుల వివరాలను కేంద్ర విద్యా శాఖ రూపొందించిన https://apaar.education. gov.in లో నమోదు చేస్తున్నారు. అనంతరం దిగువ తరగతుల విద్యార్థుల వివరాలను పొందుపరిచేలా విద్యాశాఖాధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. కేంద్ర విద్యాశాఖ దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో జిల్లా విద్యా శాఖ, ఇంటర్ బోర్డు అధికారులు ఇదే పనిలో నిమగ్నమయ్యారు.

భవిష్యత్ చదువులకు దిక్సూచి

అపార్‌తో ఎక్కడి నుంచైనా ప్రవేశాలు పొందవచ్చు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసే గుర్తింపు సంఖ్య ఆధారంగా ఈ కార్డులో విద్యార్థి బ్యాంకు ఖాతా నంబర్, డీజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. ఈ కార్డులను జారీ చేసే ముందు కేంద్ర ప్రభుత్వం అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్(ఏబీసీ)ని ప్రారంభించింది. డీజీ లాకర్ ద్వారా వివరాలు నమోదు చేస్తే విద్యార్థి పేరుతో సహా అపార్ కార్డు వస్తుంది. దీన్ని నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనిద్వారా విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల్లో వివరాల నమోదు, ధ్రువీకరణ తదితర పనులన్నీ సులువుగా పూర్తి చేయవచ్చు. ఉపకార వేతనాల మంజూరు, ఉద్యోగాల భర్తీ, ఇతర సందర్భాల్లో ఇదే కీలకం కానుంది.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు

అపార్ కార్డులో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెల గుర్తింపు సంఖ్య ఉంటుంది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, 12 అంకెల గుర్తింపు సంఖ్యతో పాటు ఆ విద్యార్థి మార్కులు, గ్రేడ్లు, ఉపకార వేతనాల వివరాలు, అవార్డులు, డిగ్రీలు, క్రీడలు, ఇతర అంశాల్లో సాధించిన విజయాలతో పాటు విద్యా సంబంధిత సమగ్ర వివరాలు కనిపిస్తాయి. తద్వారా ఈ కార్డు విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులకు ఎంత గానో ఉపయోగపడనుంది.

తల్లిదండ్రుల సమ్మతితోనే..

ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుకునే వారి వివరాలను ఇప్పటికే యూ డైస్ ప్లస్‌లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ దాదాపు పూర్తయింది. దీని ఆధారంగానే విద్యార్థుల ప్రవేశాలు, టీసీలు జారీ చేస్తున్నారు. ఇదే తరహాలోనే ఇకపై అపార్‌తో అన్ని కార్యకలాపాలు నిర్వహిస్తారు. ఇందుకోసమని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సమ్మతి పత్రాలను సేకరిస్తున్నారు. అపార్ డేటా భద్రత, గోప్యతకు ప్రాధాన్యమిచ్చేలా ప్రభుత్వ ఏజెన్సీలతో మాత్రమే సమాచారం సేకరిస్తున్నారు.

ప్రతి రోజూ సమీక్ష



అపార్ కార్డుల జారీ కోసమని విద్యార్థుల వివరాలను సకాలంలో వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ప్రిన్సిపాళ్లకు ఆదేశించాం. డేటా నమోదులో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాం. ఉన్నతాధికారుల సూచనలకు అనుగుణంగా ప్రతిరోజూ సమీక్ష చేస్తున్నాం. అపార్ కార్డు భవిష్యత్‌లో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనుంది.

-పి.మురళీధర్, ఆర్ఐవో, ఇంటర్ బోర్డు

మా సమస్యలు పట్టవా..

- ప్రభుత్వ తీరుపై మున్సిపల్ ఉపాధ్యాయుల అసంతృప్తి
- డీఈవో కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న టీచర్లు

విశాఖ విద్య: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తుండటం తగదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేడ్కర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ టీచర్ల సమస్యల పరిష్కారం కోరుతూ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం డీఈవో కార్యాలయం ముందు ధర్నా చేశారు. కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా మోకాళ్లపై నిలబడి ప్లకార్డులతో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యా యులకు వర్తించే అన్ని సౌకర్యాలు, ఉత్తర్వులు తక్షణమే మున్సిపల్ టీచర్లకు వర్తించేలా ప్రభుత్వం తగుచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్లు, బదిలీలు రెగ్యులర్‌గా జరగడం లేదని, ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్లకు ఇచ్చినట్లే మున్సిపల్ టీచర్లకు అర్బన్ ఎంఈవో పోస్టులు ఇవ్వాలని, పీఎఫ్ ఖాతాలు మున్సిపాలిటీల్లో నిరుపయోగంగా పడి ఉన్నాయని, జీతాల నుంచి మినహాయించే సొమ్ము వారి ఖాతాలకు జమ చేసేందుకు గాని, ఖాతాల్లో ఉన్న సొమ్ము అవసరాలకు వినియోగించుకునేందుకు గాని అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ టీచర్ల సమస్యలపై డీఈవో ఎల్.చంద్రకళకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.రాంబాబు జిల్లా కార్యదర్శులు చుక్క సత్యం, మహ్మద్ రిజ్వాన్, టి.జగన్, భీమిలి అధ్యక్షుడు వెంకట సంతోష్, పెందుర్తి మండల అధ్యక్షుడు జి.అప్పలరాము, చినగదిలి మండల అధ్యక్షుడు ఎమ్.మురళీ, జి.ఉషారాణి, ఎస్.శాంతి, శోభ, జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి వై.ఆర్.కె.ప్రసాద్, బి.జనార్దన్, కె.నిరంజన్ పాల్గొన్నారు.

'3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్'



సదస్సులో పాల్గొన్న వెంకట్ నాగేశ్వర్ చలసాని

మద్దిలపాలెం: భారతదేశం 2047 నాటికి ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగి, అభివృద్ధి చెందిన దేశంగా అవతరించబోతోందని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ నాగేశ్వర్ చలసాని అన్నారు. ఏయూలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా, స్ట్రాటాడిమ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన ఫైనాన్షియల్ లిటరసీ, మ్యూచువల్ ఫండ్స్ అండ్ కెరీర్ అపర్చ్యూనిటీస్ జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. దేశంలోని 65 శాతం మంది యువత డెమోగ్రాఫిక్ డివిడెండ్‌గా ఉన్నారని ఆయన తెలిపారు. దేశంలో 85 శాతం మంది అక్షరాస్యులు ఉంటే, ఆర్థిక అక్షరాస్యత కేవలం 25 శాతం మాత్రమే ఉందన్నారు. ఈ విషయంలో వృద్ధి సాధించినట్లయితే భారతదేశం మరింత ముందుకు సాగుతుందని అభిప్రాయపడ్డారు. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టేటప్పుడు లిక్విడిటీ, రిస్క్, ఇన్‌ఫ్లేషన్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. రోజురోజుకూ మారుతున్న మార్కెట్‌ను అర్థం చేసుకుంటూ పెట్టుబడులు పెడితే లాభాలను ఆర్జించవచ్చన్నారు. సెమినార్ కో- ఆర్డినేటర్ ప్రొఫెసర్ జాలాది రవి మాట్లాడుతూ ఫైనాన్షియల్ లిటరసీ, మ్యూచువల్ ఫండ్స్, కెరీర్ అపర్చ్యూనిటీస్ భారత దేశ ఆర్థిక వ్యవస్థకు మూడు మూల స్తంభాలని, విద్యార్థులు వీటిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ రాజేంద్ర బెండి ఫైనాన్షియల్ లిటరసీపై విద్యార్థులకు వివరించారు. ప్రొఫెసర్ ఎ.నరసింహారావు, ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ త్యాగరాజన్, గౌరవ ప్రొఫెసర్, డీసీఎంఎస్ ఇండస్ట్రీ కనెక్ట్ బి.మోహన్ వెంకట్ రామ్ మాట్లాడారు. స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.విశ్వనాథం, ప్రొఫెసర్ ఉమాదేవి, డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య, డాక్టర్ సురేష్, బుజ్జి బాబు, డాక్టర్ రంజిత్ కుమార్, డాక్టర్ ఆర్ హెప్సీబా, పరిశోధకులు పాల్గొన్నారు.

'రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారు'



భూపేష్‌నగర్ మహిళలకు మద్దతుగా నిరసన తెలియజేస్తున్న ఐద్వా, సిటు నాయకులు

అల్లిపురం: రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేసిందని ఐద్వా జిల్లా నాయకులు సత్యవతి మండిపడ్డారు. చావులమదుం దరి భూపేష్‌నగర్ వద్ద మద్యం షాపు వద్దని కొన్ని రోజులుగా స్థానిక మహిళలు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. మంగళవారం ఐద్వా నాయకులు పాల్గొని.. భూపేష్‌నగర్ మహిళలకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేస్తున్న వైన్‌షాపు కలిపి ఈ ప్రాంతంలో మొత్తం ఐదు మద్యం దుకాణాలు అవుతున్నాయన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని ఆరోపించారు. మద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదాయ వనరుగా పరిగణించి ప్రజల ఇబ్బందులను పట్టించుకోవడం లేదన్నారు. ఐద్వా అధ్యక్షురాలు పద్మ మాట్లాడుతూ జనావాసాల మధ్యలో మద్యం దుకాణాలు తొలగించాలని డిమాండ్ చేశారు. స్థానిక నాయకులు హంస్సేన్ మాట్లాడుతూ మూడు నెలల కిందట తమ బంధువు ఇంటికి వస్తుంటే.. కొందరు తాగుబోతులు అతనిపై దాడి చేసి డబ్బులు లాక్కొన్నారని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ.. ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళనలో సీఐటీయూ నాయకులు సుబ్బారావు, చంద్రమౌళి, ఐద్వా నాయకులు వరలక్ష్మి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణల తొలగింపు

- అక్రమాల చెర నుంచి సుమారు 15 ఎకరాల స్వాధీనం



మాట్లాడుతున్న తహసీల్దార్ చిన్నికృష్ణ, చిత్రంలో ఆర్ఐ

సబ్బవరం: మండలంలో ఆక్రమణదారుల చెరలో ఉన్న దాదాపు 15 ఎకరాల ప్రభుత్వ భూముల్ని స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. సబ్బవరంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు సబ్బవరం రెవెన్యూ పరిధిలో గెడ్డ పోరంబోకు, ప్రభుత్వ గయాలు భూముల్ని ఆక్రమించిన వ్యక్తుల నుంచి వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆ భూముల్లో హెచ్చరిక బోర్డుల్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సబ్బవరం రెవెన్యూ పరిధి సర్వే నెం.449/9లో బాదిరెడ్డి నాగరాజు ఆక్రమణలో ఉన్న 6.07 ఎకరాల ప్రభుత్వ భూమి(గయాలు), 227/3లో గొర్లి అచ్చియ్యమ్మ ఆక్రమణలో ఉన్న 2.87 ఎకరాలు, 227/4లో గొర్లి చిన అప్పలనాయుడు, 227/5లో గొర్లి అప్పలనాయుడు, 277/6, 7, 9, 10లలో అరుణ, దెడ్డం ప్రసాద్ తదితర ఆరుగురి ఆక్రమణలో ఉన్న దాదాపు 15 ఎకరాల భూముల్ని గుర్తించామన్నారు. అక్రమణదారులకు ఏపీ ల్యాండ్ ఎన్‌క్రోచ్‌మెంట్ చట్టం ప్రకారం సెక్షన్ 7 కింద నోటీస్‌లు అందించినట్లు పేర్కొన్నారు. ఆ నోటీసులకు వారిచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేకపోవడంతో సెక్షన్ 6 కింద ఆర్డర్ పాస్ చేసి అక్రమణలు తొలగించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ, ప్రజా అవసరాలకు వినియోగించాల్సిన వాగులు, వంకలు, గెడ్డలు, ప్రభుత్వ పోరంబోకు భూముల్ని ఎవరైనా ఆక్రమిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.79,640
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.73,000
వెండి(కిలో):	రూ.1,10,000

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన బాలురు, బాలికల జట్లతో నిర్వాహకులు

అగనంపూడి: గుంటూరు జిల్లా కారంచేడులో వచ్చే నెల 6 నుంచి 8వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో(అండర్-14) పోటీల్లో తలపడనున్న జిల్లా జట్లను ఎంపిక చేశారు. లంకెలపాలెం ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉమ్మడి విశాఖ స్థాయి పోటీలు, ఎంపికలు జరిగాయి. ఈ పోటీల్లో 320 మంది క్రీడాకారులు పాల్గొనగా.. పరవాడ ఎంఈవోలు దివాకరరావు, సాయిశైలజ ప్రారంభించారు. గెలుస్తామనే నమ్మకం, విశ్వాసంతో క్రీడాకారులు ఆడాలని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చిరికి వెంకటరావు, కె.ఎం.నాయుడు, పీడీ పి.లక్ష్మి, సీనియర్ పీడీలు పాల్గొన్నారు.

ఎంపికైన జట్లు ఇవే..

బాలుర జట్టు: పి.గౌతమ్, వి.రాజేష్, పి.ప్రవీణ్ కుమార్, ఆర్.తరుణ్, ఎ.భాను, డి.వరుణ్, ఎ.చంద్ర కౌశిక్, పి.వాసు, జి.స్వామి, పి.రోహిత్, ఆర్.శ్యామ్‌కుమార్, బి.చైతన్య, వి.పార్థు, వి.లక్ష్మీకాంత్

బాలికల జట్టు: ఆర్.శృతిక, ఆర్.లలితాదేవి, జి.లిఖిత, జి.నవ్య, ఆర్.ఢిల్లేశ్వరి, వై.స్వాతి, ఆర్.హర్షిణి, ఎస్.పవిత్ర, ఆర్.కుసుమకుమారి, కె.కావ్య, కె.హిరణ్యవర్మ, కె.సుప్రియ, ఎ.జాగృతి, కె.శరణ్య, టి.తనిష్క, సీహెచ్.దీపిక

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.135
స్కిన్	: రూ.240
స్కిన్‌లెస్	: రూ.250

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	540.00
విజయనగరం	544.00
శ్రీకాకుళం	544.00

కుటుంబం చెంతకు తల్లీబిడ్డ



రైల్వే స్టేషన్‌లో మహిళను విచారించి తరలిస్తున్న ఏయూటీడీ సిబ్బంది(ఫైల్)



రాయగడలో కుటుంబ సభ్యులకు జస్మిన్‌ను అప్పగిస్తున్న శ్రద్ధా సభ్యులు

అల్లిపురం: విశాఖ రైల్వేస్టేషన్‌లో నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళను గుర్తించిన ఏయూటీడీ.. ఆమెను సాధారణ స్థితికి తీసుకొచ్చి కుటుంబం చెంతకు చేర్చింది. వివరాలివీ.. ఏడాదిన్నర కిందట మతిస్థిమితం లేని ఆమెను ఏయూటీడీ సిబ్బంది టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని మహిళా నిరాశ్రయ వసతి గృహానికి తీసుకొచ్చారు. ఆమెకు సపర్యలు చేసి కేజీహెచ్ వైద్యులకు చూపించారు. ఆమె గర్భవతిగా ఉన్నట్లు గుర్తించిన వైద్యులు.. అనంతరం సురక్షితమైన ప్రసవం జరిపించారు. తర్వాత షెల్టర్‌కు తీసుకువచ్చి తల్లీబిడ్డలను సంరక్షించారు. శ్రద్ధా ఫౌండేషన్ పర్యవేక్షణలో మానసిక వైద్యశాలలో చికిత్స అందజేశారు. చికిత్స ఫలితంగా ఆమె తనది ఒడిశా రాష్ట్రం, రాయగడ జిల్లా, కస్తూరినగర్‌గా తెలియజేసింది. ఈ క్రమంలో శ్రద్ధా ఫౌండేషన్ సభ్యులు ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా.. ఆమె పేరు జస్మిన్ నాయక్ అని, ఆమె తల్లి నబినీ కుమారి కూడా మానసిక రోగి అని కుటుంబ సభ్యులు తెలిపారు. జస్మిన్ చిన్నప్పటి నుంచి మానసిక సమస్యలతో బాధపడుతోందని, గతంలో కోల్‌కతా, కేరళ వెళ్లిపోయి మిషనరీల సంరక్షణలో ఉన్నట్లు తెలిపారు. జస్మిన్ తన పెళ్లి, భర్త వివరాలు చెబుతుండటంతో వెళ్లి సంప్రదిస్తామని ఆమె మేనమామ శరత్ తెలిపారు. ఏయూటీడీ, శ్రద్ధా ఫౌండేషన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆ రైలు తిరుపతికి నడిపితే భలే డిమాండ్

వందేభారత్.. భారతీయ రైల్వే వ్యవస్థలో పెను మార్పులు తీసుకొచ్చిన రైలు. 2019లో పట్టాలపై పరుగులు ప్రారంభించిన ఈ రైలంటే..అందరికీ భలే క్రేజ్. చార్జీలు సామాన్యులకు అందుబాటులో లేకపోయినా.. ఒక్కసారైనా వందేభారత్‌లో దర్జాగా ప్రయాణం చెయ్యాలని ఉవ్విళ్లూరేవాళ్లు. అయితే ఇటీవల ప్రారంభమైన దుర్గ్-వైజాగ్ వందేభారత్ రైలు మాత్రం.. వెలవెలబోతోంది. రైలు ప్రారంభమై నెల దాటింది. ఒక్కసారి కూడా 100 శాతం ఆక్యుపెన్సీ లేదు. వైట్ ఎలిఫెంట్‌గా మారిన ఈ సర్వీసుని రద్దు చేసి.. నిరంతరం ప్రయాణికుల తాకిడి అధికంగా ఉండే తిరుపతికి నడపాలనే డిమాండ్ రోజు రోజుకీ పెరుగుతోంది.

- ఇటీవల ప్రారంభమైన దుర్గ్-విశాఖ రైలు
- రోజూ 23 శాతం కూడా నిండని సీట్లు
- 16 బోగీలను 8 బోగీలకు కుదించాలని నిర్ణయం
- దుర్గ్ సర్వీస్ మార్చే యోచనలో అధికారులు
- వైజాగ్ నుంచి తిరుపతికి నడపాలని ప్రయాణికుల డిమాండ్



సాక్షి, విశాఖపట్నం: సకల సదుపాయాలతో కూడిన ప్రయాణాన్ని అందించే వందేభారత్ రైళ్లకు ఆదిలో డిమాండ్ చాలా ఎక్కువ ఉండేది. వారం రోజుల్లోనే 100 శాతం సీట్లు బుక్ అయిపోయేవి. ఇప్పుడు కొన్ని రైళ్లలో ఆ పరిస్థితి లేదు. ఇందులో మొదటి వరుసలో ఉన్నది దుర్గ్-విశాఖ వందేభారత్. గత నెలలో దీన్ని ప్రారంభించారు. ఛత్తీస్‌గఢ్ ప్రజాప్రతినిధులు ఒత్తిడితో 16 రేక్‌లతో ప్రారంభమైన ఈ ట్రైన్‌లో సీసీ, ఎగ్జిక్యూటివ్ కోచ్‌లతో కలిపి 1,286 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కానీ రోజూ సీసీ కోచ్‌లలో 900 వరకూ, ఎగ్జిక్యూటివ్ కోచ్‌లలో 70 వరకూ సీట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అంటే 23 శాతం కంటే తక్కువ ఆక్యుపెన్సీతో దుర్గ్-వైజాగ్ వందేభారత్ నడుస్తోంది. దీంతో ఈ ట్రైన్ నిర్వహణ భారంగా మారుతోందని.. బిలాస్‌పూర్ రైల్వే అధికారులు లబోదిబోమంటున్నారు.

బాదుడే కారణమా?

ఈ రైలు దుర్గ్ జంక్షన్ నుంచి రాయపూర్, టిట్లాఘర్, రాయగడ, పార్వతీపురం, విజయనగరం మీదుగా విశాఖ చేరుకుంటుంది. ఈ రూట్లో ప్రయాణికులు చాలా వరకు తక్కువ ఖర్చుతో ప్రయాణానికే మొగ్గు చూపుతుంటారు. ఈ మార్గంలో పలు రైళ్లు నడుస్తున్నాయి. వందేభారత్‌తో పోలిస్తే తక్కువ చార్జీతో గంటా, రెండు గంటల తేడాతో గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. అలాంటప్పుడు వందేభారత్‌కు అంత డబ్బు పెట్టడం అనవసరమని ప్రయాణికుల ఆలోచన. విశాఖ నుంచి విజయనగరం వెళ్లేందుకు చైర్ కార్ రూ.435, ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ రూ.820. విశాఖ నుంచి పార్వతీపురానికి చూస్తే చైర్‌కార్ రూ.565, ఎగ్జిక్యూటివ్ కార్ రూ.1,075గా ఉంది. సాధారణ రైళ్లలో ఈ ధరలు రూ.60 నుంచి రూ.150 లోపు మాత్రమే.

కోచ్‌లు తగ్గించండి.. ప్లీజ్!

భారంగా మారుతున్న దుర్గ్-విశాఖపట్నం వందేభారత్ సర్వీసును రద్దు చెయ్యాలన్న డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. 16 కోచ్‌లతో నడుస్తున్న రైలును సగానికి పైగా తగ్గించాలని అధికారులు భావిస్తున్నారు. వీలైనంత త్వరగా కోచ్‌లు కుదించాలని రైల్వే బోర్డుకు ప్రపోజల్స్ పంపించారు. మరోవైపు దుర్గ్ సర్వీస్‌ను మార్చేందుకు సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే జోన్ అధికారులు సమాలోచనలు చేస్తున్నారు.

తిరుపతికి వందేభారత్ కావాలి

విశాఖ నుంచి తిరుపతికి వందేభారత్ నడపాలన్న డిమాండ్ ప్రయాణికుల నుంచి చాలా కాలంగా వినిపిస్తోంది. ఈ సర్వీసు నడిపితే కచ్చితంగా ఆక్యుపెన్సీ 100 శాతం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. తిరుపతి వెళ్లేందుకు ఉత్తరాంధ్ర ప్రజలు ఎక్కువగా తిరుమల ఎక్స్‌ప్రెస్‌నే ఆశ్రయిస్తుంటారు. ఈ రైలు 110 నుంచి 120 శాతం ఆక్యుపెన్సీతో రోజూ నడుస్తుంటుంది. ఈ నేపథ్యంలో తిరుపతికి ప్రత్యేకంగా వందేభారత్ సర్వీసు నడిపితే.. కచ్చితంగా విజయవంతమవుతుందని వాల్తేరు అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రతిపాదనను రైల్వే బోర్డుకు పంపించాలంటే ప్రజాప్రతినిధులు రైల్వే బోర్డుపై ఒత్తిడి తేవాలి. ఉత్తరాంధ్ర ఎంపీలెవ్వరూ దీనిపై స్పందించని పరిస్థితి.

తిరుపతికి వందేభారత్ కావాల్సిందే..



విశాఖ నుంచి తిరుపతి వెళ్లేందుకు ఎన్ని రైళ్లు వేసినా.. 100 శాతం రద్దీతోనే వెళ్తుంటాయి. కొత్త సర్వీసులపై దృష్టి సారించడం లేదు. దుర్గ్ లాంటి ప్రాంతాలకు వందేభారత్ నడిపే బదులు.. విశాఖ నుంచి తిరుపతికి ప్రారంభించాలని మేం డిమాండ్ చేస్తున్నాం. ఈ సర్వీసు మొదలైతే.. 100 శాతం అక్యుపెన్సీ రైలుగా మారుతుంది.

– ఎస్.ఈశ్వరరావు, ప్రయాణికుడు

ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకురావాలి



ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తిరుపతికి వెళ్లాలంటే తిరుమల ఎక్స్‌ప్రెస్‌పైనే ఆధారపడుతున్నాం. 120 రోజులు ముందు బుకింగ్ చేసుకోవాలనుకున్నా టికెట్లు దొరకని పరిస్థితి. వందేభారత్ నడిపినా ఇదే డిమాండ్ ఉంటుంది. ఉత్తరాంధ్ర ఎంపీలు విశాఖ-తిరుపతి వందేభారత్ సర్వీస్ గురించి రైల్వే బోర్డుపై ఒత్తిడి తీసుకురావాలి.

– దుర్గా ప్రసాద్, శ్రీకాకుళం